క్లుప్తంగా

కేఎల్‌యూ విద్యార్థినికి రాష్ట్రస్థాయి అవార్డు



మంగళగిరి: నగర పరిధిలోని వడ్డేశ్వరంలో కేఎల్ డీమ్డ్ యూనివర్శిటీ.. అర్కిటెక్చర్ విభాగంలో నిర్మాణ శైలిలో అత్యంత ప్రతిభ కనపరచి రాష్ట్ర స్థాయి అవార్డు సాధించినట్లు కేఎల్ స్కూల్ ఆఫ్ అర్కిటెక్చర్ విభాగాధిపతి డాక్టర్ ఎ.ప్రియా తెలిపారు. అర్కిటెక్ విభాగంలో చివర సంవత్సరం చదువుతున్న సుంకర మౌనిక అనే విద్యార్థి థీసస్‌ను ప్రదర్శించడంలో అత్యంత ప్రతిభ కనపరచి అవార్డు సాధించడం అభినందనీయమన్నారు. ఆదివారం విజయవాడ ఏ కన్వెన్షన్ హాలులో జరిగిన కార్యక్రమంలో అవార్డు అందుకున్న మౌనికను ఐఐఏ చైర్మన్ విజయభాస్కర్, క్రాంతికుమార్‌లతో పాటు యూనివర్శిటి నిర్వాహకులు అభినందించినట్లు తెలిపారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

ఫిరంగిపురం: ఆధార్‌లో మార్పులు, చేర్పుల కోసం పలు గ్రామాల్లో మంగళవారం నుంచి ఈ నెల 27వ తేదీ వరకు ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విమాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తక్కెళ్ళపాడు, రేపూడి, అమీనాబాద్‌-1, వేములూరిపాడు, ఫిరంగిపురం-1, 2, గ్రామాల్లో 23 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించే క్యాంపులో సచివాలయం డీఏ గణేష్ భార్గవ్ కంప్యూటర్ ఆపరేటర్‌గా వ్యవహరిస్తారని చెప్పారు. అదేవిధంగా మేరికపూడి, పొనుగుపాడు, గుండాలపాడు, బేతపూడి, యర్రగుంట్లపాడు, 113 తాళ్లూరు గ్రామాల్లోనూ అదే తేదీలలో డీఏ కె.అరుణ కంప్యూటర్ ఆపరేటర్‌గా నమోదు చేస్తారని పేర్కొన్నారు. ఫిరంగిపురం-3, వేమవరం, నుదురుపాడు గ్రామాల్లో 26, 27న ఆధార్ క్యాంపులు నిర్వహిస్తామని, చిన్న పిల్లలకు ఆధార్ నమోదు, కొత్తగా ఆధార్ కావాలనే వారి కోసం, తప్పొప్పుల సవరణకు గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

రక్తదానం చేసిన యువకుడు

మంగళగిరి: ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలికి ఓ యువకుడు రక్తదానం చేశాడు. మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో యర్రబాలేనికి చెందిన వృద్ధురాలు పాశం లక్ష్మమ్మ గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో అనారోగ్యంతో కొద్ది కాలంగా చికిత్స పొందుతోంది. ఆమె శస్త్ర చికిత్స నిమిత్తం.. రక్తం అవసరమని వైద్యులు సూచించారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న శాలివాహన పేటకు చెందిన యువకుడు ప్రభుత్వాసుపత్రికి చేరుకుని రక్తదానం చేశాడు. వృద్ధురాలు కుటుంబసభ్యులు, వైద్యులు యువకుడిని అభినందించారు.

కోర్టు పరిధిలో పాఠశాల అభివృద్ధి పనులు

సాక్షి ఎఫెక్ట్

తాడికొండ: తుళ్లూరు మండలం కేవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అభివృద్ధి పనులు కోర్టు ఉత్తర్వుల మేరకు తాత్కాలికంగా నిలిచిపోయినట్లు సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ జి.విజయలక్ష్మి తెలిపారు. సోమవారం సాక్షిలో ప్రచురితమైన మడుగు కాదు- పాఠశాల మైదానం శీర్షికన వార్తకు ఆమె స్పందించారు. పాఠశాల సీఆర్‌డీఏ స్మార్ట్ స్కూల్ ప్రోగ్రాంలో భాగంగా సుమారు రూ.2.80 కోట్ల నిధులతో అభివృద్ధి చేసేందుకు ముందుకొచ్చినట్లు తెలిపారు. అయితే పాఠశాల క్రీడా మైదానం విషయంలో గ్రామస్తులు న్యాయస్థానంలో అభ్యంతరం వ్యక్తం చేసినందున జనవరి కోర్టు ఉత్తర్వుల మేరకు పనులు తాత్కాలికంగా ఆగినట్లు ఆమె తెలిపారు.

ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక



లాం(తాడికొండ): స్థానిక లాంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో 25వ ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక నిర్వహించడం జరిగిందని ప్రిన్సిపల్ ఎం.ఉషారాణి తెలిపారు. పలు రకాల పరీక్షలు నిర్వహించిన అనంతరం మొత్తం 31 మంది క్యాడెట్లను ఎంపిక చేసి వారికి బయోమెట్రిక్ ప్రక్రియ పూర్తి చేశామన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్‌సీసీ ద్వారా విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు పెంపొందించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీ ప్రియాంక, కో-ఆర్డినేటర్ అపర్ణ, బెటాలియన్ సుబేదార్ దేవరాజ్, హవాల్దార్ కృష్ణ, సీటీవో తిరుమల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: వ్యక్తి ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటనపై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. రామిరెడ్డితోట 3వలైనులో నివాసం ఉండే సీరంశెట్టి దుర్గాప్రసాద్(35) అనారోగ్యం, ఆర్థిక సమస్యలతో సోమవారం ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి, కేసు నమోదు చేశారు.

ఇదీ.. రైతు బజారు టమాటా ధర

- టమోటాల బాక్స్ బహిరంగ మార్కెట్‌లో రూ.1,312
- రైతు బజారులో రూ.1,512లకు విక్రయించాలంటున్న అధికారులు



రైతు బజార్‌లో టమాటాల కొనుగోలు

మంగళగిరి: ఎక్కడైనా రైతు బజార్ కంటే..బహిరంగ మార్కెట్‌లో ధరలు ఎక్కువ. కానీ, మంగళగిరి రైతు బజార్‌లో మాత్రం ఇందుకు పూర్తి విరుద్ధంగా సాగుతోంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో టమాటాల బాక్స్(27 కేజీల)రూ.1,312లకే దుకాణదారులకు అందుతోంది. వారు వినియోగదారులకు ఖర్చులతో కలుపుకుని కిలో రూ.52 లేదా రూ.53 లకు విక్రయించాల్సి ఉంది. అయితే సోమవారం అదే టమాటాల బాక్స్ రైతు బజార్‌లో రూ.1,512కు విక్రయించాలని అధికారులు చెప్పడంతో రైతు బజార్ నిర్వాహకులు ఆశ్చర్యపోయారు. దుకాణదారుడుకి కిలో రూ.56లకు అందుతుండగా... ఖర్చులతో కలిపి రూ.60కి వినియోగదారులకు విక్రయించాలని అధికారులు చెప్పడంతో మిన్నకుండిపోయారు. బహిరంగ మార్కెట్ కంటే అధిక ధరలకు రైతు బజార్‌లో టామోటాలు విక్రయించడంపై వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే రైతు బజార్‌లలో దళారీ వ్యవస్థ చేరిందని, దీంతో ధరలు పెంచి విక్రయించి, సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెలరోజుల వ్యవధిలోనే ఒక్క కూరగాయలే కాక నిత్యావసర సరకుల ధరలకూ రెక్కలొచ్చాయి. మార్కెట్‌లో అధిక ధరలతో సామాన్యులు ఏమీ కొనలేని తినలేని పరిస్థితి నెలకొంది.

ప్రమాదకరంగా డివైడర్లు





డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా కొట్టిన లారీ(ఫైల్), ప్రమాద సూచికలు లేకుండా ఉన్న బస్టాండు వద్ద డివైడర్

ఫిరంగిపురం: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన డివైడర్లు ప్రమాదకరంగా మారాయి. వీటిని ఎన్నో ఏళ్ల కిందట తక్కువ ఎత్తులో నిర్మించారు. ఆ ప్రాంతంలో ప్రమాద సూచికలు తెలిపే బోర్డులు, సిగ్నల్స్ లేకపోవడంతో తరచుగా వాహన ప్రమాదాలు జరుగుతున్నాయి. డివైడర్ రాత్రిళ్లు కనిపించడం లేదు. దీంతో ప్రతి నెలలో ఐదు నుంచి ఆరు వరకు ప్రమాదాలు జరుగుతున్నాయి. గుంటూరు, కర్నూలు వెళ్లే రాష్ట్ర రహదారి కావడం, పల్నాడు జిల్లాలకు ప్రధాన మార్గం కావడంతో వేలాదిగా వాహనాల రాకపోకలు జరుగుతుంటాయి. ఇంతటి ప్రాధాన్యమున్న రహదారిపై అధికారుల పర్యవేక్షణ లేదని ఆరోపణలున్నాయి. సరైన సూచికలు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహన డ్రైవర్లు ఆరోపిస్తున్నారు. డివైడర్లను తరచుగా లోడుతో ఉన్న వాహనాలు ఢీ కొడుతున్నాయి. దీంతో వాహనాల యజమానులు తీవ్రంగా నష్టపోతున్నారు.

ఇంత జరుగుతున్నా.. అధికారులు స్పందించకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు. విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి, ప్రమాద సూచికలు తెలిపే బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

భూముల క్రయ విక్రయాలు చెల్లవు

ఎంటీఎంసీ కమిషనర్ ఎస్కే అలీంబాషా హెచ్చరిక

సాక్షి ఎఫెక్ట్

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాజ పుల్లయ్యనగర్‌లోని 310 సర్వే నంబరులో ప్రభుత్వ భూమే కదా కొందాం..అమ్ముదాం అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో గత ఆదివారం కథనం ప్రచురితమయ్యింది. ఆరు ఎకరాల ప్రభుత్వ భూమిని రైతులకు ప్రభుత్వం సాగు కొరకు ఇవ్వగా.. ఆ భూములను టీడీపీ నేతలు దళారులుగా క్రయవిక్రయాలు చేపట్టారు. ఈ నేపథ్యంలో సాక్షి దిన పత్రికలో వచ్చిన కథనంతో స్పందించిన ఎంటీఎంసీ కమిషనర్ 310 సర్వే నంబరులోని భూములు నిషిద్ధ జాబితాలో ఉన్నాయని, ఈ ఏడాది ఫిబ్రవరిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, ఆక్రమణలను తొలగించడం జరిగిందన్నారు. భూములు ఎంటీఎంసీ పరిధిలో ఉన్నందున ఆక్రమించుట క్రయవిక్రయాలు నిర్వహించడం చట్టారీత్యానేరమన్నారు. నిబంధనలు ఉల్లఘించి భూములను విక్రయిస్తే చట్టప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నేడు రాజధానిలో మంత్రి నారాయణ పర్యటన

తాడికొండ: మంత్రి నారాయణ మంగళవారం రాజధానిలో పర్యటించనున్నారు. ఉదయం 7 గంటల నుంచి 8.30 గంటల వరకు అమరావతి లో పర్యటిస్తారు. రాజధానిలో పలు భవన నిర్మాణాలు, రహదారులను పరిశీలించి, అనంతరం మందడంలో విలేకరుల సమావేశంలో మాట్లాడతారని మంత్రి కార్యాలయం నుంచి ప్రకటన వెలువడింది.

నేటి నుంచి ఆధార్ స్పెషల్ డ్రైవ్

తాడికొండ: మండలంలో ఆధార్ స్పెషల్ డ్రైవ్ మంగళవారం నుంచి నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బి.శివన్నారాయణ తెలిపారు. 23న శాఖమూరు, వెంకటపాలెం, తుళ్ళూరు, 24న నేలపాడు, వెలగపూడి, దొండపాడు, 25 నెక్కల్లు, మల్కాపురం, బోరుపాలెం, 26 అనంతవరం, ఉద్దండ రాయునిపాలెం, రాయపూడి, 27 వడ్డమాను, లింగాయపాలెం, తుళ్ళూరు గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ జరగనుందన్నారు. అయా గ్రామాల్లోని ప్రజలు ఈ సదావకాశాన్ని ఉపయోగించుకొని ఆధార్ సేవలు పొందాలని పేర్కొన్నారు.

చలపతి అధ్యాపకులకు ఉత్తమ పేపర్ అవార్డు ప్రదానం



అధ్యాపకులను అభినందిస్తున్న ప్రిన్సిపల్, డీన్, అధ్యాపకులు

మోతడక(తాడికొండ): మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన అధ్యాపకులు డాక్టర్ పి.నాగమల్లేశ్వరరావు, డాక్టర్ జి.శ్రీనివాసరావు ఉత్తమ పేపర్ అవార్డు ప్రదానం జరిగిందని ప్రిన్సిపల్ డాక్టర్ కె.నాగ శ్రీనివాసరావు తెలిపారు. తమిళనాడులోని లయోలా కళాశాల ఆఫ్ ఆర్ట్ అండ్ సైన్స్‌లో మార్చి 13-14తేదీల్లో జరిగిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ ఎంబ్రాసింగ్ డిజిటల్ హారిజన్ (ఈఐడీ- 2024) నందు ప్రదర్శించిన డీప్ లెర్నింగ్ అండ్ ఏఐ బేస్డ్ జండర్, ఏజ్ క్లాసిఫికేషన్‌కు చేసిన ఉత్తమ పేపర్ ప్రజెంటేషన్ చేసినందుకు గాను వీరిని ఈ అవార్డులకు ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ కళాశాలలో పరిశోధనలకు అవసరమైన ప్రోత్సాహం అందించడంతో తమ అధ్యాపకులు అవార్డులు సాధించారని, మరిన్ని పరిశోధనలకు ప్రోత్సాహం అందిస్తామన్నారు. డీన్ డాక్టర్ పి.ఫణి కుమార్ మాట్లాడుతూ అధ్యాపకులు పరిశోధనలలోని అవకాశాలు అందిపుచ్చుకొని మరింత ఉన్నత శిఖరాలకు చేరాలని సూచించారు. ఈ సందర్భంగా అవార్డులు సాధించిన అధ్యాపకులను ప్రిన్సిపల్, డీన్‌లతో పాటు పలువురు అధ్యాపకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి జి.రామచంద్రరావు, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

బుడంపాడు హై లెవల్ చానల్ పరిశీలన



కాలువను పరిశీలిస్తున్న అజయ్‌కుమార్, కొల్లి రంగారెడ్డి తదితరులు

లక్ష్మీపురం: గుంటూరు జిల్లాలోని అనేక గ్రామాలకు తాగునీరు, సాగునీరు అందించే గుంటూరు హై లెవల్ చానల్ మరమ్మతులు తక్షణమే చేయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి డిమాండ్ చేశారు. బుడంపాడు వద్ద హై లెవల్ కాలువను సీపీఐ, రైతు సంఘం నాయకులు సోమవారం పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయ గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజయవాడ, ప్రకాశం బ్యారేజి నుంచి గుంటూరు జిల్లాకు తాగునీరు, సాగునీరు అందించే 47 కిలోమీటర్ల ప్రధాన కాలువ పాలకుల నిర్లక్ష్యానికి గురై నరకకూపాన్ని తలపిస్తోందని చెప్పారు. ఈ కాలువ ద్వారా మంగళగిరి, పొన్నూరు, ప్రత్తిపాడు నియోజకవర్గాలకు సంబంధించి పదివేల ఎకరాల మెట్ట, 20 వేల ఎకరాల మాగాణికి నీరు అందుతుందని వివరించారు. మంగళగిరి, గుంటూరు, కార్పొరేషన్లతో పాటు 30 గ్రామాల ప్రజలు తాగునీటి అవసరాలకు వాడుతున్నారని గుర్తు చేశారు. ఈ కాలువపై ఉన్న చాప్టలు, బలహీనపడి పగుళ్లు ఏర్పడడంతో గుంటూరుతో పాటు ఉండవల్లి, తాడేపల్లి, మంగళగిరి, పెదకాకాని తదితర ప్రాంతాల నుంచి మురుగు నీరు ఈ కాలవలో కలుస్తున్నదని తెలిపారు. కాలువలో కలవకుండా ఈ కాలువపై ఉన్న చప్టాలకు మరమ్మతులు చేసి మురుగునీరు కాలువలో కలవకుండా తగిన చర్యలు తీసుకోని అనేక గ్రామాల ప్రజలకు గత జిల్లా కలెక్టర్ ప్రజా ప్రతినిధులకు అధికారులకు విన్నవించుకున్న ఫలితం లేకుండా పోయిందన్నారు. దీనితో పాటు గుర్రపు డెక్క, తూటాకు ప్లాస్టిక్ వ్యర్థాతో కాలువ నిండి పోయి ప్రజా ఆరోగ్యం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కాలువ కట్టలపై గండ్లు పడితే పంటలకు ఎంతో నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి ఏటా నిధులు తగిన విధంగా కేటాయించక, కేటాయించిన నిధులను కూడా సక్రమంగా వినియోగించక పనులను ఆలస్యంగా ప్రారంభించడంతో వర్షాలు వచ్చి పనులు నిలిపి వేయడం జరుగుతుందన్నారు. ఈ ఏడాది అయినా ఈ కాలువ అభివృద్ధికి తగిన నిధులు కేటాయించి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి, వ్యర్థాలను తొలిగించడంతో పాటు కాలువ గట్లపై పెరిగిన తుమ్మ తదితర మొక్కలను తొలిగించి, కాలువలపై ఉన్న చప్టాలకు మరమ్మతులు చేయక పోవడం వల్ల మురుగునీరు మంగళగిరి, డ్రైనేజీలో కలసి ఈ నీరు కలుషితమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చల శివాజీ పాల్గొన్నారు.

వైభవంగా అష్టోత్తర శతకలశ స్నపన మహోత్సవం



కలశాలతో..



హాజరైన భక్తులు

నగరంపాలెం: ఆషాఢమాస శ్రవణా నక్షత్రం పురస్కరించుకుని సోమవారం బృందావన్‌గార్డెన్స్‌లో వేంచేసిన పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామికి 108 కలశాలతో అభిషేకాలు వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు మాధవస్వామి మాట్లాడుతూ స్నపన(అభిషేక) వైభవాన్ని గురించి విమానార్చన కల్పంలో విఖానస మహర్షి అద్భుతంగా అందించారని అన్నారు. అందరూ ఐదు కలశాలతో, తొమ్మిది కలశాలతో, పద్నాలుగు కలశాలతో చేస్తారని పేర్కొన్నారు. అయితే 108 కలశాలతో చేసే స్నపన ఉత్తమమైనది అని మహర్షి ప్రస్తావిస్తారని అన్నారు. నిక్షిప్త ద్రవ్యాల ప్రభావం వివరిస్తూ సర్వపాపవిశుద్ధాత్మ సర్వపాపాలు తొలగి, భవిష్యత్‌లో మహరాజు అవుతారని మహర్షి అన్నారని తెలిపారు. ఆనంద నిలయుని అభిషేకంలో భాగస్వాములై తరించాలని కోరారు. అనేక ద్రవ్యాలతో జరిగే ఈ అభిషేక తీర్థం స్వీకరించిన వారికి శరీర రుగ్మతలన్నీ తొలగిపోయి, ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలుగుతాయని అన్నారు. భక్తులు పెద్ద ఎత్తున్న తరలివచ్చి, స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులు, దేవాలయ పాలకమండలి అధ్యక్షులు సిహెచ్.మస్తావయ్య, సహాయ కార్యదర్శి బొర్రా ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రతి ముగ్గురిలో ఒకరికి నరాల సమస్యలు

- అవగాహనతో మెదడు సమస్యలు నివారించవచ్చు
- సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ పమిడిముక్కల విజయ



డాక్టర్ పి.విజయ

గుంటూరు మెడికల్: ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ముగ్గురిలో ఒకరు వారి జీవితకాలంలో నరాల సంబంధిత జబ్బుల బారిన పడే అవకాశం ఉందని లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ పమిడిముక్కల విజయ అన్నారు. వరల్డ్ బ్రెయిన్ డే సందర్భంగా సోమవారం స్థానిక కొత్తపేటలోని లలితా హాస్పిటల్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా వైకల్యానికి నాడి సంబంధిత జబ్బులే ప్రధాన కారణమని పేర్కొన్నారు. 80 శాతంకు పైగా నాడి సంబంధిత ప్రమాణాలు, వైకల్యాలు న్యూరో స్పెషలిస్టుల సంరక్షణ, వనరులు తక్కువగా ఉన్న దిగువ మధ్యతరగతి దేశాల్లో సంభవిస్తున్నాయని చెప్పారు. అభివృద్ధి చెందతున్న దేశాల్లో ప్రతి పది లక్షల మందికి ఒక న్యూరాలజిస్టు, కోటి మందికి ముగ్గురు న్యూరో సర్జన్లు అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. మన దేశంలో నరాల సంబంధిత జబ్బుల్లో 42.2 శాతం బ్రెయిన్ స్ట్రోక్‌లు, 16.3 శాతం మైగ్రేన్, 10.4 శాతం డిమెన్షియా, 7.9 శాతం మెనింజైటీస్, ఐదు శాతం ఎపిలెప్సి, పార్కిన్‌సన్, డయాబెటిక్ న్యూరోపతి, నాడీ వ్యవస్థ క్యాన్సర్‌లని తెలిపారు. ఆరోగ్యకరమైన జీవన శైలితో 90 శాతం బ్రెయిన్ స్ట్రోక్‌లు, 40 శాతం డిమెన్షియా కేసులు, 25 శాతం ఎపిలెప్సిలను నివారించవచ్చు అన్నారు. మెదడులో న్యూరాన్లు అని పిలువబడే వంద బిలియన్ కణాలు ఉంటాయని, మిలియన్ల కొద్ది విద్యుత్ తీగలతో ఆక్సాన్స్ అని పిలువబడే న్యూరాన్‌ల మధ్య పది ట్రిలియన్ కనెక్షన్లు ఉంటాయన్నారు. ఇవి మనం చదవడానికి, రాయడానికి, ఆలోచించడానికి, చూడడానికి, తెలుసుకోవడానికి, అనుభూతి చెందడానికి సహాయ పడతాయన్నారు. మెదడు సమస్యల బారిన పడకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ సమతుల్య ఆహారం ముఖ్యంగా పండ్లు, కూరగాయలు, తృణ ధాన్యాలు, ఆరోగ్యకరమైన కొవ్వులతో కూడిన ఆహారం తీసుకోవాలని చెప్పారు. ప్రతిరోజూ 30 నిమిషాల పాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా మెదడుకు రక్త ప్రసరణ పెరిగి కొత్త మెదడు కణాల పెరుగుదలను ప్రోత్సహిస్తుందన్నారు. ధ్యానం, యోగ వంటివి చేయడం ద్వారా ఒత్తిడి జయించవచ్చని, మెదడును దెబ్బతీసే కారకాల్లో ఒత్తిడి ఒకటని పేర్కొన్నారు. బీపీ, షుగర్, పల్స్, బీఎంఐలు తరచుగా పరీక్ష చేయించుకోవాలని సూచించారు. ప్రతిరోజూ 7 నుంచి 9 గంటలు నిద్రపోవాలని, ధూమపానం, మద్యపానంకు దూరంగా ఉండాలన్నారు. చదరంగం, ఫజిల్స్, సూడోకో వంటి బ్రెయిన్ గేమ్స్ ఆడడం వల్ల బ్రెయిన్ డిజార్డర్స్ నివారించవచ్చు అని తెలిపారు. సామాజిక కార్యకలాపాల్లో చురుకుగా ఉండాలని, కుటుంబం, స్నేహితులతో సన్నిహితంగా ఉండాలని డాక్టర్ విజయ సూచించారు.

లోకానికి వేదాలను అందించిన వ్యాస భగవానుడు



గుంటూరు ఎడ్యుకేషన్: ఏడు కోట్ల మంత్రాలను నాలుగు వేదాలుగా విభజించిన వ్యాస భగవానుడు వేదవ్యాసునిగా అవతరించారని టీజేపీఎస్ కళాశాల విశ్రాంత తెలుగు ఆచార్యులు డాక్టర్ జి.వైదేహి అన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో సోమవారం సంస్కృత విభాగ ఆధ్వర్యంలో వ్యాస పూర్ణిమ నిర్వహించారు. వైదేహి మాట్లాడుతూ కాలం గడిచే కొద్దీ మానవుని బుద్ధిశక్తి క్షీణిస్తోందని, అందుకు అనుగుణంగానే బ్రహ్మసూత్రాలు, అష్టాదశ పురాణాలను రచించి వేదసారాన్ని మహా భారతంగా అందించాడని పేర్కొన్నారు. టీజేపీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ మాట్లాడుతూ ఆషాఢమాసంలో వచ్చే గురు పూర్ణిమను వ్యాసపూర్ణిమ అని పిలుస్తారని, లోకానికి జ్ఞానభిక్ష పెట్టిన వ్యాసుడు జన్మించిన రోజు అని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, సంస్కృత విభాగాధిపతి డాక్టర్ పి.దేవేంద్ర గుప్తా, డాక్టర్ ఎ.అంజనీ కుమార్, ఆర్.జయశైలజ పాల్గొన్నారు.

అవుట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఇన్‌చార్జి కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మాల్యాద్రి

నెహ్రూనగర్: గత కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న అవుట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ గుంటూరు నగర ప్రధాన కార్యదర్శి కోట మాల్యాద్రి విన్నవించారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో ఆయన్ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో రోడ్లపై వేస్తున్న మస్తర్‌ను నిలుపుదల చేసి, శానిటరీ కార్యాలయాల వద్దనే మస్తర్లు వేయాలని, 62 సంవత్సరాలు పూర్తయి నిలుపుదల చేసిన, మరణించిన, అనారోగ్యంతో పనులు చేయలేకపోయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. అవుట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులకు ఆదివారం పూర్తి సెలవు, ప్రభుత్వ జాతీయ సెలవులను పూర్తిగా అమలు చేయాలన్నారు. నగర జనాభా విస్తారంగా పెరుగుతున్న కారణంగా కార్మికుల సంఖ్యను కూడా పెంచాలని కోరారు. బదిలీ కార్మికులను అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ ద్వారా పూర్తి స్థాయి కార్మికులుగా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

మెష్‌లు, ఫ్యాన్లు అందజేత



గురుకుల పాఠశాలకు మెష్‌లు, ఫ్యాన్లు అందజేస్తున్న దాతలు

తాడికొండ: దాతల సాయంతో తాడికొండలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, బీసీ బాలికల వసతి గృహంలో దోమల నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ నెల 16న తాడికొండలో పర్యటించిన జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి వసతి గృహాలను పరిశీలించి, చిన్నారులను దోమలు కుట్టకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో స్పందించిన తహసీల్దారు పిన్నక మధుసూదనరావు దాతలను సంప్రదించారు. దగ్గుమల్లి కమలాకర్ రూ.50 వేలు, నల్లపనేని లీలా శంకర్, నల్లగర్ల ప్రసాద్, యేనుగంటి నాగలక్ష్మయ్య తదితరులు మొత్తం లక్ష విలువ చేసే ఫ్యాన్లు, కిటికీలకు మెష్‌లు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చారు. సోమవారం తహసీల్దారు మధుసూదనరావు చేతుల మీదుగా దాతలు పాఠశాల ప్రిన్సిపల్‌కు వాటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు కాకుమాను ప్రసాద్, పాఠశాల ప్రిన్సిపల్ నెమలికంటి మరియదాసు, వైస్ ప్రిన్సిపల్ శేఖర్, వీఆర్‌వో శర్మ, స్థానిక నాయకులు బండ్ల కోటేశ్వరరావు, పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.